క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ శ్రీలత

కొత్తూరు: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొత్తూరు జెడ్పీటీసీ శ్రీలత అన్నారు. నందిగామ మండలంలో రంగాపూర్ గ్రామంలో హిస్పో పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ యువత, విద్యార్థులకు ఆయా క్రీడల్లో ఉన్న ఆసక్తిని గుర్తించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో మరింత నైపుణ్యాన్ని పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సాయిలు, లక్ష్మణ్‌నాయక్, పీఈటీ పుణ్యవతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ కమిటీ సభ్యుడిగా రాజు



రాజుకు నియామక పత్రం అందజేస్తున్న అన్వేశ్‌రెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ కిసాన్ కమిటీ సభ్యుడిగా ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తాండకు చెందిన రాజు నాయక్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని కిసాన్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ రైతుల పక్షాన పోరాటం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రాములు, రాజు, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా హార్స్ జంపింగ్ షో



పెద్దమంగళారంలో హార్స్ జంపింగ్ షో

మొయినాబాద్: మండలంలోని పెద్దమంగళారంలో నిర్వహించిన హార్స్ జంపింగ్ షో అట్టహాసంగా జరిగాయి. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి సన్‌రైజ్ డైరీ ఫాంలో హార్స్ రైడింగ్ పోటీలు నిర్వహించారు. జంపింగ్ షోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రైడర్లకు మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో హార్స్ రైడింగ్ క్లబ్‌లు పెరుగుతున్నాయన్నారు. చాలా మంది గుర్రపుస్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇలాంటి పోటీలు రైడర్స్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు హార్స్ రైడర్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వానికి చర్యలు తప్పవు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న దామోదర్

శంకర్‌పల్లి: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎం దామోదర్ హెచ్చరించారు. సోమవారం శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శంకర్‌పల్లి, టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సెంటర్‌లలో ఓపీ నిర్వహణ, ఆరోగ్య కేంద్రం నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయపాలన పాటించి వైద్య సేవలు అందించాలని సూచించారు. క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రేవతిరెడ్డి, ప్రియాసింగ్, సుష్మ, ప్రశాంతి, ప్రసన్న, అనూష, శోభ, సిబ్బంది మన్సూర్, సంతోష, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

గతుకులు.. అతుకులు



సురంగల్ రోడ్డుపై గుంతలు

మొయినాబాద్–సురంగల్ రోడ్డుకు రూ.2.20 కోట్లు నిధులు మంజూరు

- ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన పనులు
- ఇప్పటికీ పూర్తి కాని వైనం

మొయినాబాద్: ఓ వైపు నుంచి రెండు కిలోమీటర్ల దూరం తారు రోడ్డు వేశారు. మరో వైపు నుంచి సుమారు కిలోమీటర్ దూరం సిమెంటు రోడ్డు వేశారు. మధ్యలో 200 మీటర్ల దూరం రోడ్డు వేయకుండా వదిలేశారు. మండల పరిధిలోని చిలుకూరు నుంచి మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పట్లోనే మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సబితారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం ఆరు నెలల తరువాత పనులు ప్రారంభించారు. మొదటగా సురంగల్ గ్రామం నుంచి కిలోమీటర్ దూరం వరకు సిమెంటు రోడ్డు వేశారు. ఆ తరువాత మొయినాబాద్ నుంచి సురంగల్ పెద్ద చెరువు అలుగు వరకు బీటీ రోడ్డు వేశారు. మధ్యలో సుమారు 200 మీటర్ల దూరం రోడ్డు వేయకుండా వదిలేశారు. పెద్ద చెరువు అలుగు సమీపంలో రోడ్డుపై కల్వర్టు నిర్మించాల్సి ఉంది. మిగిలిన 200 మీటర్ల దూరం సీసీ రోడ్డు వేయాల్సి ఉన్నా పంచాయతీ రాజ్ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కల్వర్టు నిర్మించాల్సిన చోట పైపులు పగిలి రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం పడింది. వర్షానికి రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎంపీపీ, జెడ్పీటీసీ చొరవ తీసుకుని రోడ్డు పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు అండగా పాలమూరు ట్రస్టు

ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీలు కడుతున్న మహిళలు

కేశంపేట: పాలమూరు చారిటబుల్ ట్రస్టు పేదలకు, మహిళలకు అండగా ఉంటుందని ట్రస్టు చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని కొండారెడ్డిపల్లి, సంతాపూర్, పాటిగడ్డ, అల్వాల, మంగళిగూడ గ్రామాల్లో 18 ఏళ్ల పైబడిన మహిళలకు పాలమూరు ట్రస్టు ఆధ్వర్యంలో రాఖీలు, చీరెల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకే కాకుండా యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఉద్యోగ మేళా నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల కోసం పాలమూరు ట్రస్టు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, సంతాపూర్ సర్పంచ్ అంజయ్య, శ్రీనివాస్, మహేశ్, కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలి

షాద్‌నగర్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలతో పాటు పదోన్నతులను కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జునరావు కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదోన్నతులు, పీఆర్సీ విషయంలో ఆశలు పెట్టుకున్నా ప్రభుత్వ వైఖరితో నిరాశే ఎదురవుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్సీ, ఐఆర్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆసరాతో ఆదుకుంటున్న సీఎం కేసీఆర్

ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్

మొయినాబాద్: సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లతో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలను ఆదుకుంటున్నారని ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చిలుకూరులో దివ్యాంగులకు పెంచిన పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, కారోబార్ రాజేశ్, నాయకులు ఆంద్రూ, జయవంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి నివాళి



రాములమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యాదయ్య

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి వైస్ ఎంపీపీ కురుమ రాములమ్మ ప్రథమ వర్ధంతిని మిర్జాగూడ గ్రామంలోని ఎంకేఎస్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య రాములమ్మ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేశ్, మిర్జాగూడ సర్పంచ్ రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



దివ్యాంగులకు పెన్షన్ డబ్బులను అందజేస్తున్న మాధవి

సర్పంచ్ మాధవి

షాద్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ మాధవి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామంలో దివ్యాంగులకు పెన్షన్ డబ్బులను మాధవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరకంగా, మానసిక వైకల్యంతో పోరాడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. వీరికి ప్రభుత్వం ఆసరా పథకం కింద పెన్షన్లను పెంచడం అభినందనీయని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి, వార్డు సభ్యులు బుగ్గమ్మ, రశీదా, శశాంక్, మల్లేశ్, బాలమ్మ, గ్రామస్తులు బలరాం, షరీఫ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ ఎండీ వాహజుద్దీన్‌ఖాన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాహజుద్దీన్‌ఖాన్

షాద్‌నగర్ రూరల్: పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యునాని ఆసుపత్రి డాక్టర్ ఎండీ వాహజుద్దీన్‌ఖాన్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద యునాని ఆసుపత్రి పరిధిలోని అప్పారెడ్డిగూడలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వాహజుద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను తప్పని సరిగా పాటించాలన్నారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైదులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజిత, ఫార్మాసిస్టు అలవేలమ్మ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయంతో న్యాయం

చేవెళ్ల: మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా పదోన్నతి కల్పించడం సంతోషంగా ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు భారతి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కేంద్రం ఎదుట మినీ అంగన్‌వాడీల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయంతో 3,989 మందికి న్యాయం జరిగిందన్నారు. ఏడేళ్లుగా సమస్యలపై పోరాడుతున్నామని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం కావటం హర్షనీయమన్నారు. సహకరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కార్మిక విభాగం చైర్మన్ నారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీ టీచర్స్ అండాలు, వినోద, లావణ్య, కృష్ణవేణి, వినోద, చంద్రకళ, ప్రియాంక, నాగమణి, తదితరులు ఉన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



కోడిపిల్లలు పంపిణీ చేస్తున్న రవీందర్‌రెడ్డి

షాబాద్: రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రాజేందర్‌గర్ పీవీ నర్సింహారావు పశువైద్యకళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద పీవీ నర్సింహారావు పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో వంద మంది రైతులకు ఉచితంగా పెరటి కోడిపిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోళ్ల పంపిణీ చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కోళ్ల పెంపకంతో రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. భవిష్యత్తులో ఎస్సీ రైతులకు మేకలను ఉచితంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీ నర్సింహారావు పశువైద్యకళాశాల ప్రిన్సిపల్‌లు రఘునందన్, ఉదయ్ కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ నర్సింహా, గోపాలకృష్ణ, సత్యనారాయణరాజు వైద్య సిబ్బంది ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మంగళూర్ నార్త్ ఎమ్మెల్యే భరత్‌శెట్టి



ఆమనగల్లులో బీజేపీ నేతల బైక్ ర్యాలీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కల్వకుర్తి ఇన్‌చార్జి, మంగళూర్ నార్త్ ఎమ్మెల్యే భరత్‌శెట్టి మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆమనగల్లు నుంచి కల్వకుర్తికి చేపట్టిన బీజేపీ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే భరత్‌శెట్టి ప్రారంభించారు. బైక్ ర్యాలీలో బీజేపీ జాతీయ నాయకులు ఆచారి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కృష్ణయ్యగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శంకర్

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామానికి చెందిన కానుకుర్తి కృష్ణయ్యగౌడ్, చాకలి రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మృతుల కుటుంబాలను పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లయ్య, హాజిపల్లి తదితరులు ఉన్నారు.

ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్సే



కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

- పామెన గ్రామంలో జెండా ఆవిష్కరణ
- గ్రామ కమిటీల ఎన్నిక

చేవెళ్ల: ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పీసీసీ నాయకుడు జనార్దన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామంలో సోమవారం పార్టీ జెండా ఆవిష్కరణ, గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకుడు సున్నపు వసంతం, మాజీ డీసీసీ నాయకుడు వెంకటస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

పామెన నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా కావలి బాబు, ప్రధాన కార్యదర్శిగా క్రిష్ణ, కార్యదర్శులుగా రామస్వామి, విఠల్, సుధాకర్‌రెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మంత్రిని కలిసిన సురేందర్‌రెడ్డి



మంత్రి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి తదితరులు

శంకర్‌పల్లి: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని కొండకల్ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తాను ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహించే కొండకల్, కొండకలతాండ, శేరిగూడ గ్రామాలపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వివక్షత చూపుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. తమ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇప్పటివరకు దళితబంధు కేటాయించలేదన్నారు. బీసీబంధు కోసం 25-30 లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని, ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రిని సురేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం, గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు గోవింద్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, రాంచద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణంలోని రైతు కాలనీలో కోట మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన దేవాలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలను మూడు రోజుల పాటు దేవాలయ సమితి, రైతు కాలనీ సంక్షేమ సంఘం, రుద్రవీణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వస్తి పుణ్యావాహచనం, నాంధీ సమారాధన, పంచగవ్య పచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, నవగ్రహారాధన, పంచ కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మొదటి రోజు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖాజా పాషా, శుక్రవర్ధన్‌రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బుచ్చయ్య, చెరుకు శివ, జగన్‌మోహన్‌రెడ్డి, మురళీమోహన్, మాధవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి



నూతన బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. చటాన్‌పల్లిలో రైల్వే గేటు వద్ద ఉన్న బ్యాంకును దూసకల్ రోడ్డులోని నూతన భవనంలోకి మార్చారు. సోమవారం ఈ బ్యాంకును చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఏపీజీవీబీ బ్యాంకు ఖాతాదారులకు సేవలను అందిస్తోందన్నారు. ఖాతాదారులకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఇటీవల శంకరయ్య అనే ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ప్రమాద భీమా పథకం కింద మృతుడి కుమారుడికి రూ.20లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రవి కిషోర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్లు రవికాంత్, మెర్సీ, సుదేశ్, అనూష, బ్రాంచ్ మేనేజర్ నారాయణ, ఫీల్డు ఆఫీసర్ సూర్యవతి ఖాతాదారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మత్తులో పడొద్దు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న భీంరాజ్

సబ్ రిజిస్ట్రార్ భీంరాజ్

మొయినాబాద్: యువత క్రీడల్లో రాణించాలని సబ్ రిజిస్ట్రార్ భీంరాజ్ అన్నారు. మండలంలోని సురంగల్‌లో కర్రోళ్ల కృష్ణయ్య జ్ఞాపకార్థం సురంగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో 6 జట్లు పాల్గొని తలపడ్డాయి. ఎస్ఎంఆర్, సిక్స్‌స్టార్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఇరుజట్ల మధ్య హోరాహోరిగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఎంఆర్ జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రాధానోత్సవ కార్యక్రమానికి భీంరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియా మత్తులో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, షఫీ, నారాయణ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు ధన్‌రాజ్, శ్రీధర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, ప్రభుయాదవ్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనమెత్తిన చిన్నారి

షాబాద్: వర్షాలు పుష్కలంగా కురియాలే... పాడి, పంట బాగుండాలె... పిల్లజల్లాను సల్లంగా చూడాలె తల్లీ.. అంటూ షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ గ్రామాల్లో మంగళవారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. డోలు, డప్పు, భాజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల సందడితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ముదెంగూడ ఎంపీటీసీ చెన్నయ్య, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ గ్రామాల సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, మాజీ సర్పంచ్ గణేశ్‌గౌడ్, గ్రామస్తులు తదితరులున్నారు.